తాగునీటి సమస్యను పరిష్కరించండి

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీవాసులు తీవ్ర నీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఎన్‌టీఆర్‌నగర్‌లో వేలాది మంది పేద ప్రజలు నివాసముంటున్నారు. లోప్రెషర్‌తో నీరు సరిగ్గా రాకపోవడంతో సరిపోవడం లేదంటున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ ధోబీగల్లీలోని శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయంలో అమ్మవారి మకర తోరణం ప్రారంభోత్సవ ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు దాతలను సన్మానించారు. పూజల్లో సుదర్శన్, బాబు శ్రీనివాస్, నర్సింగ్‌రావు, రవీందర్, శ్రీదేవి, రాకేష్, రాజేశ్వరి, మోహన్ పాల్గొన్నారు.

నియామకం


ఎమ్మెల్యే బలాలతో సాలోమాన్ జోబ్స్

మలక్‌పేట: ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ తెలంగాణ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా మలక్‌పేటకు చెందిన డాక్టర్ పి. సాలోమాన్ జోబ్స్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ హక్కులను కాపాడటానికి కృషి చేస్తామన్నారు. మానవ హక్కులకు భంగం వాటిల్లకుండా ప్రజలను చైతన్య వంతం చేస్తామన్నారు. మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలను కలిసి 2బీహెచ్‌కే నివాసులు ఎదుర్కొంటున్న సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతోష్, రహుఫుద్దీన్, కృష్ణయ్య, సయ్యద్ అలీ, జనార్ధన్ ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం


సాంబయ్య

హస్తినాపురం: ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గురుద్వార్ రోడ్డులో నివాసముంటున్న సాంబయ్య (65) ఇంట్లో నుంచి బయటకి వెళ్లి రాత్రైనా ఇంటికి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పరామర్శ


సునరితా అజీత్‌రెడ్డిని పరామర్శిస్తున్న కవిత, మహమూద్ అలీ

మలక్‌పేట: మాజీ హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీ కవిత ఆదివారం మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి, బీఆర్‌ఎస్ మలక్‌పేట ఇన్‌చార్జి తీగల అజీత్‌రెడ్డి దంపతులను పరామర్శించారు. అవుటర్ రింగ్‌రోడ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో వారి కొడుకు తీగల కనిష్కరెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న వారు ఆదివారం సలీంనగర్‌లోని నివాసానికి వెళ్లి పరామర్శించారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు..
టమాటా రూ.13, వంకాయ రూ.23, బెండ రూ.50, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.40, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.09, క్యారెట్ రూ.17, దొండ రూ.45, ఆలుగడ్డ రూ.20, ఉల్లిగడ్డ రూ.34, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ09, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.50, చామగడ్డ రూ.55, మునగ రూ.45, కందగడ్డ రూ.70, బీట్‌రూట్ రూ.17, కీర రూ.23, బీన్స్ రూ.45, క్యాప్సికమ్ రూ.28.
ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

హెచ్చరికలకే పరిమితం..

కానరాని పరిష్కారం


శ్రీకృష్ణానగర్ కాలనీలో పారబోసిన భవన నిర్మాణ వ్యర్థాలు


ప్రధాన రహదారిలో వేసిన మట్టి, ఇటుకలు

చైతన్యపురి: రహదారులు, కాలనీ, బస్తీల రోడ్లపై భవన నిర్మాణ వ్యర్థాలు వేస్తే జరిమానా విధిస్తామని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నా కొందరు మాత్రం వారి మాటలు లెక్క చేయకుండా ఇష్టానుసారంగా డంప్ చేస్తున్నారు. రోడ్లపై భారీగా డంప్ చేస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు. గడ్డిఅన్నారం డివిజన్ శ్రీకృష్ణానగర్ కాలనీలో ఏ రోడ్డు పక్కన చూసినా మట్టికుప్పలే దర్శనమిస్తున్నాయి. ఇళ్ల కూల్చివేత, మరమ్మతుల తర్వాత వెలువడే నిర్మాణ వ్యర్థాలను రోడ్ల పక్కనే డంప్ చేస్తున్నారు. నెలల తరబడి వాటిని తొలగించకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు.రోడ్లు, రహదారులపై భవన నిర్మాణ వ్యర్థాలను డంప్ చేస్తున్న వారిపై మున్సిపల్ అధికారులు కూడా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్లు, రహదారులపై వ్యర్థాలు వేస్తున్న వారిపై చర్యలు తీసుకుని వాటిని తరలించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


కాలనీ ప్రధాన ద్వారం వద్ద పేరుకుపోయిన మట్టికుప్పలు


రోడ్డు మధ్యలో ఇలా..

ఫేస్-2లోని గ్రౌండ్‌లో ప్లే గ్రౌండ్ నిర్మిస్తాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: వనస్థలిపురం, పరిసర ప్రాంతాల్లో ఇప్పటికే చాలా పార్కులు ఉన్నాయని, వనస్థలిపురం ఫేస్-2లోని గ్రౌండ్‌లో పార్కు కాకుండా ప్లే గ్రౌండ్‌ను నిర్మిస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సు.దీర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఫేస్-2లోని గ్రౌండ్‌లో కాలనీవాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు ఇక్కడ పార్కును నిర్మించాలని కోరగా, స్థానిక యువకులు ప్లే గ్రౌండ్‌గా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఆయన యువత ఆడుకోవడానికి సరైన ప్లే గ్రౌండ్ లేనందున ఇక్కడ ప్లే గ్రౌండ్ నిర్మించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. స్థానికులకు ఇబ్బందులు తలెత్తకుండా గ్రౌండ్ చుట్టూ గ్రిల్స్ ఎత్తు పెంచి, జాలీ, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే కొంత మేర వాకింగ్ ట్రాక్ కూడా నిర్మిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్, కాలనీ నాయకులు జగదీష్‌కుమార్, సంజయ్ కుమార్, రామ్మోహన్, అశోక్‌కుమార్, శివశంకర్, ప్రవీణ్, బీరప్ప, శోభ, అనూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధైర్య సాహసాలు అవసరం



విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేసిన సినీనటుడు సుమన్

మీర్‌పేట: సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలను ఎదుర్కొనేందుకు మహిళలకు ధైర్య సాహసాలు అవసరమని సినీనటుడు సుమన్ అన్నారు. అందుకు కరాటే విద్య వారికి ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. లార్డ్స్ విద్యాసంస్థలు స్థాపించి 20 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా జిల్లెలగూడలోని పాఠశాల స్పోర్ట్స్ మీట్ ఆరోహన్-2025 శనివారం రాత్రి అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కరాటేలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, ఆట పాటలు, అన్ని రంగాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ సిద్దాల శ్రీలత, మాజీ కార్పొరేటర్లు భూపాల్‌రెడ్డి, అనిల్‌యాదవ్, సిద్దాల పద్మ, పోరెడ్డి పద్మ, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోండి

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధి లక్ష్మీనగర్ కాలనీ చౌరస్తాలో అక్రమంగా సెల్లార్ తవ్వుతున్నారని ఆ స్థలానికి ఆనుకొని ఉన్న అపార్ట్‌మెంట్ వాసులు ఆందోళన చెందుతున్నారు. లక్ష్మీనగర్ చౌరస్తాలో ఉన్న పురాతన భవనాన్ని కూల్చిన నిర్మాణదారులు నూతనంగా నిర్మాణానికి పూనుకున్నారు. 267 గజాల స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణదారులు సెల్లార్ తవ్వకం ప్రారంభించారు. ఈ స్థలానికి ఆనుకొని పురాతన అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. నాలుగు రోజుల క్రితం కాలనీవాసులు జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేయగా సదరు నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టవద్దని చెప్పి అక్కడి గేట్‌ను సీజ్ చేశారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు వచ్చిన ఒక్కరోజు మాత్రమే పనులు ఆపిన నిర్మాణదారులు మళ్లీ ప్రారంభించారు. అక్రమ నిర్మాణాన్ని వెంటనే అడ్డుకోవాలని, జీహెచ్‌ఎంసీ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు యాకత్‌పురా ఎమ్మెల్యేను కలిసి ఫిర్యాదు చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా కృషి చేయాలి

అబిడ్స్: మహిళలు అన్ని రంగాల్లో రాణించే విధంగా కృషి చేయాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రాష్ట్ర అసిస్టెంట్ కమిషనర్, ధూల్‌పేట ఎక్సైజ్ స్పెషల్ అధికారి ఎస్.అంజిరెడ్డి పేర్కొన్నారు. ధూల్‌పేట్‌లో కరిష్మాసింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నారీ హై శక్తి అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం మహిళా రంగ అభివృద్ధికి ఎంతో చేయూతనిస్తుందన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు నందకిశోర్‌వ్యాస్ మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యమిస్తుందన్నారు. మహిళా శక్తితోనే ప్రపంచం ముందుకు కొనసాగుతుందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు పప్పుమాత్రే, ఆనంద్‌సింగ్, రజని, మణిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం


పూజలో పాల్గొన్న మహిళలు

వనస్థలిపురం: వనస్థలిపురం హుడా కాలనీ ఫేజ్-2లోని శ్రీ పోచమ్మ తల్లి దేవాయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. రెండవరోజు ఆదివారం యాగశాలలో ఆరాధన చండీహవనం, ధ్వజ స్తంభ ఆరాధన, దాన్యాధివాసం, మూల మంత్రహవనం, పుష్ప శయాధివాసం, మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పూజల్లో కాలనీ అధ్యక్షుడు గాండ్ల ఆనంద్‌రాజ్, ఆలయ అధ్యక్షుడు ఎస్.రాములు, కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ధ్వజస్తంభ దాతలు భవానీ రాజశేఖర్, విజయ, భవానీ ప్రమోద్‌కుమార్, అనిత, కాలనీ నాయకులు సతీష్‌కుమార్, నాగేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆటోలో మర్చిపోయిన బ్యాగు అందజేత


బాధితులకు బ్యాగులను అందజేస్తున్న దృశ్యం

హయత్‌నగర్: ఆటోలో మర్చిపోయిన ఆభరణాలు ఉన్న బ్యాగును బాధితులకు పోలీసులు అప్పగించిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వీరసత్య మల్లేష్ ఆయన భార్య శ్రీసూక్ష్మ హయత్‌నగర్‌లోని సూర్యనగర్‌లో నివాసముండే తమ స్నేహితుడి దగ్గరకు వెళ్లేందుకు శనివారం ఉదయం హయత్‌నగర్‌లో బస్సు దిగారు. అక్కడి నుంచి సూర్యానగర్‌కు వెళ్లేదుకు ఆటో ఎక్కారు. ఆటో దిగిన తర్వాత పరిశీలించగా తమ హండ్ బ్యాగు కనిపించలేదు. బ్యాగులో కొన్ని బంగారు ఆభరణాలు, రూ.14వేల నగదు ఉన్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా ఆటోను గుర్తించి బాధితులకు బ్యాగును అప్పగించారు.

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



నాగోలు: నాగోలు డివిజన్ ఫతుల్లాగూడ పరిధిలోని దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి నగర్(సర్వేనెంబర్ 58) కాలనీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం కాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీఆర్‌ఎస్ నాయకులు మామిడి రాంచందర్ పాల్గొని నూతన కమిటీ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శి చెలకుర్తి విష్ణుచారి, ఇతర సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధి కోసం నూతన కమిటీ సభ్యులు నిరంతరం కృషి చేయాలని సూచించారు.

సమస్య పరిష్కారానికి కృషి


చైర్మన్ నర్సింహారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

మీర్‌పేట: అధిక ఇంటి పన్ను సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించేందుకు కృషి చేస్తానని టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం ఫెడరేషన్ ఆఫ్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వితీయ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రతినిధులు మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ, పక్కనే ఉన్న బడంగ్‌పేటలో అనుసరిస్తున్న పన్ను విధానాన్ని మీర్‌పేటలో అమలు చేయాలని, వార్షిక అద్దె విలువ ఆధారంగా పెంచిన ఇంటి పన్నులు తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. అధిక ఇంటి పన్ను మీర్‌పేట ప్రజలకు ఆర్థిక భారంగా మారిందని పేర్కొన్నారు. వీలైనంత త్వరగా పెంచిన ఇంటి పన్నును తగ్గించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, ప్రతినిధులు వెంకటయ్య, మల్లారెడ్డి, ప్రేమ్‌చందర్‌రెడ్డి, పద్మాచారి, శివానందం, శ్రావణ్, ప్రభాకర్‌రావు, జగాశ్‌రెడ్డి, శాంతమూర్తి, సుధాకర్‌రెడ్డి, కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో పలువురిపై కేసు నమోదు

నాగోలు: నాగోలు సాయినగర్ కాలనీలో శ్రీసాయినగర్ సీనియర్ సిటిజన్స్ ఫోరం ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న రామచంద్రారెడ్డిపై అదే కాలనీ చెందిన కొందరు వ్యక్తులు దాడి చేయడంతో రామచంద్రారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ నెల 2న సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం రీడింగ్ రూమ్ ప్రారంభోత్సవం చేశారు. సందర్భంగా శ్రీసాయినగర్ సౌత్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నుంచి 30 మంది వచ్చి తన పైదాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని రామచంద్రారెడ్డి ఫిర్యాదు చేశాడు. ఈ నెల 5న శ్రీసాయినగర్ సౌత్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నుంచి వచ్చిన బద్దం భాస్కర్, మల్లేశం, సీహెచ్ ఉమేష్‌గౌడ్, శివకృష్ణ, నరేందర్‌గౌడ్ సీనియర్ సిటిజన్స్ ఫోరం భవనం గురించి రామచంద్రారెడ్డి గొడవ పెట్టుకుని తనపైన దాడి చేశారని మళ్లీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టి దాడి చేసిన 5 మంది కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. తనను కాలనీలో ఉండనివ్వకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని తనపై దాడి చేసి వారిని వెంటనే అరెస్టు చేయాలని రామచంద్రారెడ్డి ఆదివారం ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు.

మరుగున పడేశారు..

'ఆరు బయట మలమూత్ర విసర్జన మంచిది కాదు. బహిరంగ మలమూత్ర విసర్జన మానుకుందాం' అంటూ ప్రభుత్వాలు విస్తృత ప్రచారం చేశాయి. అత్యవసరాలకు రహదారులు, కూడళ్లు తదితర ప్రాంతాల్లో ప్రజా మూత్రశాలలు ఏర్పాటు చేశాయి. కానీ నిర్వహణ లోపంతో అవి మరుగున పడ్డాయి.

- నిర్వహణలేక.. నిరుపయోగంగా ప్రజా మరుగుదొడ్లు
- ఏడాది తిరగక ముందే తాళాలు!


నిరుపయోగంగా శ్రీరాంకాలనీ పీఎఫ్‌టీ టాయిలెట్


పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో ప్రజా మూత్రశాలల నిర్వహణ అటకెక్కింది. ఎంతో ఆర్భాటంగా మూత్రశాలల నిర్మాణం చేపట్టిన అధికార యంత్రాంగం.. పర్యవేక్షణ మరచింది. ఫలితంగా కొన్ని అపరిశుభ్రతకు నిలయంగా మారగా.. మరికొన్ని కబ్జాల బారిన పడుతున్నాయి. జల్‌పల్లిని ఓడీఎఫ్(బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత పట్టణం)గా ప్రకటించిన నేపథ్యంలో.. ప్రజా మూత్రశాలల నిర్వహణపై మొదట్లో ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా 2017లో మున్సిపాలిటీలో మరుగుదొడ్లు లేని దాదాపు వంద కుటుంబాలను సర్వే ద్వారా గుర్తించి మరుగుదొడ్లు నిర్మించారు. ఇక బాటసారులు, ప్రయాణికుల సౌకర్యార్థం పహాడీషరీఫ్, శ్రీరాం కాలనీ, కొత్తపేటలో పక్కాగా ప్రజా మూత్రశాలలను నిర్మించారు. వీటికి కొనసాగింపుగా 2020వ సంవత్సరంలో షాహిన్‌నగర్, జల్‌పల్లి, శ్రీరాం కాలనీ, ఎర్రకుంటలో రూ.లక్షలు వెచ్చించి పీఎఫ్‌టీ (ప్రీ ఫాబ్రికేటెడ్ టాయిలెట్) స్వచ్ఛ మూత్రశాలలను నిర్మించారు.

పేరుకే 53..

బాటసారుల అత్యవసరాల నేపథ్యంలో మున్సిపాలిటీ పరిధిలో 53 ప్రజా మూత్రశాలలు అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలు జరిగాయి. వీటిని ప్రధాన కూడళ్లు, బస్టాప్‌లు, శ్మశాన వాటికలు, కూరగాయల మార్కెట్ల సమీపంలో నిర్మించాలని భావించారు. ఇందులో ఏడు బీవోటీ(బిల్ట్ ఆపరేటెడ్ టాయిలెట్)మూత్రశాలలు ఉన్నాయి. వీటిల్లో ఓ వ్యక్తి పర్యవేక్షకుడిగా ఉంటూ, నామమాత్రపు రుసుం వసూలు చేసి, శుభ్రంగా ఉండేలా చూస్తాడు. కానీ ఒక్క బీఓటీ కూడా నిర్మాణం రూపు దాల్చలేదు. వీటితో పాటు మరో 15 సాధారణ టాయిలెట్లు.. పెట్రోల్ పంపుల్లో 12 మూత్రశాలలు, ఫంక్షన్‌హాళ్లలోని నాలుగు మూత్రశాలలను పబ్లిక్ టాయిలెట్లుగా పరిగణిస్తామని ప్రకటించినా అధికారుల పర్యవేక్షణ కొరవడింది.


తాళాలు..

2020 అక్టోబర్ 2 గాంధీ జయంతిని పురస్కరించుకుని జల్‌పల్లి బస్టాప్, శ్రీరాం కాలనీ శ్మశాన వాటిక, షాహిన్‌నగర్‌లోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్ వద్ద పీఎఫ్‌టీలను అందుబాటులోకి తెచ్చారు. కానీ నిర్వహణ లోపంతో ప్రస్తుతం అవి నిరుపయోగంగా మారాయి. శ్రీరాం కాలనీలో పక్కాగా నిర్మించిన మూత్రశాల కబ్జా బారిన పడింది. ఇక పహాడీషరీఫ్, కొత్తపేటలో అధికారులు తాళాలు వేశారు. దీంతో అవీ వృథాగా పడున్నాయి. సిబ్బంది కొరత, ఏడాది తిరగక ముందే కమిషనర్ల బదిలీ ఇందుకు కారణంగా కనిపిస్తుంది.



మూతపడిన పహాడీషరీఫ్ మూత్రశాల

పే అండ్ యూజ్ బెస్ట్



గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా ఆవిర్భవించి పదేళ్లు కావొస్తుంది. కానీ జల్‌పల్లిలో మూత్రశాలల నిర్మాణం జరగడం లేదు. మున్సిపాలిటీకి కేంద్రంగా ఉన్న ఈ గ్రామంలో ప్రజలకు సరిపడా స్థాయిలో పే అండ్ యూజ్ టాయిలెట్ నిర్మిస్తే బాగుంటుంది. అధికార యంత్రాంగం ఈ దిశగా చర్యలు తీసుకోవాలి.
– మంద ప్రశాంత్, జల్‌పల్లి

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515
9912220363
9912220365